"యావజ్జీవం హోష్యామి"

"అబ్బాయి నెత్తుకోవాలి"

"తెల్లవారిందా?"

"మీ కింకా కనపడలే దేమో గాని గంటయిం దప్పుడే"

"........ఏడిసిన ట్టుంది జవాబు"

"జవాబు మట్టు కేనా?"

"సంతోషించాం గానీ—తొరగా దయచెయ్యి"

"మిమ్మల్నింకా చాలా సంతోష పెట్టాలి కదా, దయ చెయ్యక అక్కడ కాపరం వుంటానా మరీ?"

"కాపరం వుంటానా అంటే, ఆశమ్మలూ బోసెమ్మలూ చేరతారు కాదూ?"

"చేరితే"

"కబుర్లు మొదలు పెట్టక బుర్ర వంచుగు రమ్మంటున్నాను"

"నేను మొదలు పెట్టను లెండి"

"వాళ్ళు మొదలు పెడితే అందుకుంటావా?"

"మీరు వద్దనలేదే?"

"ఇప్పు డంటున్నాను. ఎవర్నీ పలకరించకు"

"అంతే కదా మహాభాగ్యం? అలాగే లెండి"

"ఎవరయినా పలకరించినా పలక్కు"

"అదొక టుందీ యింకా? అయితే, పలికే దాకా పలకరిస్తే?"

"అంత అవసరం యేమి వచ్చిందని అడుగు"

"అడుగుతాను. తప్పకుండా అడుగుతాను. మీ రడగమన్నారని చెప్పి మరీ అడుగుతాను, సరా?"

"అడుగు"

"అయినా, వోపట్టాన చెప్పకపోతే?"

"....—నీ—మొఖం—"

"ఏమీ మించిపోలేదు, సావకాశంగా మీ మొఖం కడుక్కోండి ముందు"

"ఇదిగో, యిదే చెప్పడం, యివాళ త్వరగా వంట కావాలి"

"అంత తొందర కేం వచ్చిందో?"

"నిన్న రాత్రి భోజనం యెలా చేశానో—"

"నే నేమి వంట చేశానో, యెలా వడ్డించానో—"

"సాక్షాత్తూ కాశీ అన్నపూర్ణవు, లోటు చేస్తావా నువ్వు?"

"అదిగో, చూశారా? వెక్కిరించబోయినా వున్నమాటే వచ్చింది, న్యాయం యెక్కడికి పోతుందీ?"

"అంతా న్యాయమే తక్కువేం? అంచేతనే తెల్లవారాటప్పటికి తిన్నదంతా జీర్ణం అయిపోయి, కడుపు మళ్ళీ నకనక లాడిపోతోంది."

"నయమే కాదూ? కొంతమంది చెయ్యే కాదు, కళ్ళుపడ్డా జీర్ణం కాదు తెలుసా?"

"ఇక చాలించి తొరగా—"

"అంత తొందర అయితే, నేను వచ్చాటప్పటికి పొయిలో నిప్పు పడెయ్యండి"

"ఇల్లలక్కుండానే?"

"వల్లకాకపోతే యిల్లే ముందు అలికెయ్యండి, మిమ్మల్నెవరువద్దన్నారూ?"

2

"ఏం వండుతా వీపూట?"

"ఏమి వండమంటారు చెప్పండి మీ నోట"

"ఇంటో యేమేమి వున్నాయ్?"

"దొండకాయలు కోసి పట్టుకురండి, పండిపోయే టట్టున్నాయ్"

"పాడు దొండకాయలు— చచ్చుదొండకాయలు— దిక్కుమాలిన దొండకాయలు—వద్దు వద్దంటూ వుంటే పెరట్లో పడేశావు పాడు"

"మీ తిట్లే బలం అయి విరగకాస్తోం దది. కనక, పాడు కింద పద్మాసనం వేసుక్కూచుని తావళం తిప్పకుంటూ—"

"ఎందు కెందు కని వూరుకుంటున్నాను గానీ—యెర్రగా చూశానంటే మండి చక్కాపోతుంది నీ దొండపాదు, ఏమనుకున్నావోను"

"నే నేమీ అనుకోను గానీ—నేనే దొండకాయలు కోసి, నేనే తరిగి, నేనే పొయిమీద పడేస్తాను గానీ—మీ యెర్ర చూపేదో పొయిలో పెట్టిన చెక్కపేళ్ళమీద ప్రసరింపచెయ్యండి చూతాం"

"ముందు నోరు మూసుకో, తరవాత యింకేం వుందో అఘోరించు"

"..............."

"పనసకాయా?"

"..............."

"ఆనబగాయా?"

"..............."

"గుమ్మడివుందా?

"..............."

"పెండలమా?"

"..............."

"దిక్కుమాలిన సంజ్ఞలు చాలించి, యీపాటికి నోరు తెరిచి చెప్పు"

"అరిటిపువ్వండి"

"ఛా"

"నేతిబీరకాయ—"

"థూ"

"అయితే, మునగాకు తీసుకురండి, ఆషాఢంలో మరిచేపోయాం, మీరూ నేనూ కూడా"

"అంతకంటే గడ్డి నయం"

"మీకంత నోరూరిపోతూ వుంటే అదే వండిపెడతాను తెచ్చుకోండి పాపం"

"................"

"............ ......"

"ఇంకేమీ లేదుషే కొంపలో?"

"పోనీ, మీమట్టుకి గోంగూరా పప్పూ వెయ్యనా?"

"నీకో?"

"ఉల్లిపాయలు—"

"ఎన్నిమాట్లు బుద్ధిచెప్పినా అవి మానవు ఎవ రయినా విన్నా చూసినా తలవంపులు"

"పనికట్టుకువచ్చి మీ తల వంచుతూ కూచోడాని కెవరున్నా రండి యిప్పుడు తీరుబడిగా?"

". . . . ."

"మిడుతూ మిడుతూ చూస్తే యేమన్నమాటా?"

"నువ్వు రాకపూర్వం వుల్లిపాయ లెవ రయినా యెరుగుదురా యీకొంపలో?"

"మీ అమ్మ వండడం నే నెరుగుదును, తెలుసా?"

"తెలుసు, నీకోసం వండింది"

"ఇప్పుడూ నా కోసమే, యిక మీ కేం బాధా?"

"దిక్కుమాలిన అలవాటు గానీ — పుట్టింట యెలా యేడ్చినా—"

"శుభ మల్లే నిండింటో కూచుని అలా యేడ్పులు తెచ్చుకుంటా రెందుకూ? మీ నోట్లో శని వుంది కాబోలు, మీరు మానుకోండి, హరీ అనేదాకా నేను మాత్రం మానను"

"మానవు నువ్వు. మాన్తావూ? ఓశాస్త్రమా, వో సంప్రదాయమా?"

"ఏం లోటు వచ్చిందీ?"

"అంతా లోటే. అవి తినవచ్చు నని యేశాస్త్రంలో వుందీ?"

"పొడుం పీల్చ మని యేశాస్త్రంలో వుందీ?"

"................"

"మీ తాత వేదవేత్తలుట. మీ నాన్న తర్కపండితులుట; కాని, కావ్యా లయినా పూర్తికాకపోయె మనకి. తిమ్మప్పదీక్షితులుగారు సాయంపడితే గాని, మొన్న కొల్లూరి రఘునాథావధానులుగారి యింటో వాడుగు చేయించలేక

పోతిమి మనం. అయినా, సంప్రదాయం కావలసివచ్చింది మనకి, సంప్రదాయం"

"......................"

"చేతగానప్పుడు, ఎవళ్ళ రుచి వాళ్ళ దనీ, యెవళ్ళ అలవాటు వాళ్ళ దనీ, యెవళ్ళ పద్ధతి వాళ్ళ దనీ నోరు మూసుకు వూరుకోడం చేతగాదాయె మనకి?"

"...................."

"మీకీ పట్టింపు లెందుకో గాని యీవూరి విద్వాంసులంతా తింటూనే—"

"రహస్యంగా—"

"మీరూ రహస్యంగానే కానివ్వండి వద్దన్నవా రెవరూ?"

3

"ఏమట్టుకి వచ్చింది వంట?"

"బాగుంది సడసం!

"ఏం?"

"వెర్రి కుదిరింది రోకలి తలకి చుట్టమన్నాట్ట"

"అంటే?"

"అన్నం వార్చాలా మీ తొందరే మీదా?"

"చంద్రుడు మొగమూ నువ్వూ ఇంకా అక్కడే వున్నావూ?"

"బయలుదేరానా? అడుగుపడుతోందా? ఒకటి రెండు మజిలీలు దాటానా? ఎంత పరుగెత్తినా యిక్కడా అక్కడా లేదు కదా—"

"సిగ్గూ భిడియమూ లేకపోతే సరి"

"ఆరగించేవారు మీరు కాగా, వంటచెయ్యడానికి నేను సిద్ధపడ్డందుకు, కదూ?"

"...................."

"వెళ్ళిపోతారా? యేమిటి?"

"...................."

"అన్నట్టు మరిచిపోయి మడికట్టేసుకున్నాను, పిలిచినట్టే వచ్చారు పాపం, బియ్యం కొలిచి అక్కడపెట్టి మరీ వెళ్ళండి"

"..........ఇంకా యెసట్లో బియ్యం పొయ్యలేదూ?"

"ఇప్పటి కింకా పొయ్య లేదే అనుకోండి. మీతో అబద్ధాలాడ్డం యెందుకూ?"

"ఎసరు కాగిందా, పోసీ?"

"ఎసటినీళ్ళు కళపెళ్ళాడితే బియ్యపుగింజలు కుతకుత లాడ్డం యెంత సేపండీ?"

"మరి వార్చా లన్నావేం, అదే తరవాయి అయినట్టు?"

"అత్తిసరుమెతుకులూ పచ్చిపులుసూ తినడం నావల్లకాదు సుమండీ"

"ఛా, బుద్ధి తక్కువ పెద్దమ్మా..........."

"అలా రుంజుకుంటూ వెళ్ళిపోతే కాదు మరి. అంట్లు పట్టుకువెళ్ళి దాసీది చెరువుదగ్గిరే కూచుంది, తొరగా పట్టుకురావా లని చెప్పిరండి వెళ్ళి"

"ఆసి నీయిల్లు—ఎసరుపడెయ్యకుండానే యీ కథు ర్లన్నీ?"

"గిన్నెలు లేందే నేనేం చేతు నమ్మా, నడమంత్రం కాకపోతే?"

"పొయ్యిలో నిప్పయినా వేశావా?"

"సడే, యిప్పడే కాదూ పొయ్యలికానూ? ఆరాలా?

"..................."

"మాట్టాడితే విషపుచూపులు తప్ప మరో మరో ప్రయోజకత్వం లేదు. వాటి మొగం మండ, చెక్కపేళ్ళు వో—ట్టి పచ్చిముద్దలు, ఎండువి తెచ్చుకోడం చేతకాదు మళ్ళీ"

"........... ...."

"బుడ్డెడు కిరసనాయిలు పోశాను, భగ్గు మనడమే కాని—"

"ఏమీ లేందే మడికట్టుకున్నా వెందుకు మరీ?"

"చద్దన్నం తినకుండా నే నుండలేను బాబూ"

4

"ఏం చేస్తున్నావ్?"

"ఏం చెయ్యమంటార్?"

"ఏమి టా మాటా?"

"ఏమి వచ్చిందీ లోటూ?"

"నాకర్మమూ నీయోగమూనూ, తెలిసిందా? దాని కేంగానీ—యెవరూ వచ్చారుట మన యింటికి?"

"మీది కర్మమే, సందేహం లేదు, నాది యోగమే తక్కువేమీ లేదు. దాని కేంగానీ—అందు కెవ రేమి చేస్తారుగానీ—మా మరిది వచ్చాడు"

"మీ శిష్యుడు బాపన్న కాడు, సుందరం?"

"నాశిష్యు డయితే నే నున్నచోటికే వచ్చును, వెతుక్కుంటూ"

"నిజమే"

"అయితే, పెద్దమనిషి యేడీ?"

"అత నలా వెళ్ళాడు, మీ రిలా వచ్చారు"

"ఎక్కడికి వెళ్ళాడూ?

"ఇంటికి"

"ఏం?"

"మహాబాగుం దండోయ్! ఎవళ్ళ యింటికి వాళ్ళు వెడితే తప్పా?"

"అప్పుడే వెళ్ళా దేమని అడిగాను, తెలివి"

"ఎప్పటి కయినా వెళ్ళాలా వద్దా అంటాను, సరసం"

"................"

"సైకి లుంది కనక, బుద్ధిపుట్టిం దంటే యిట్టే వస్తాడు, అట్టే వెడతాడు. అతని కేం, రాకపోతాడా, వచ్చి వుండిపోతాడా? అక్కడికీ, వచ్చిన పని అయి పోయినా యెంత సేపు కని పెట్టుకున్నా డనీ పాపం!"

"కని పెట్టుకున్నా డంటే అతడు వచ్చినట్టు నా కేం కల వస్తుందా?"

"నడుస్తూనే కునికిపాట్లు పడతారు మీరు కల కేమీ భాగ్యం దయ రావాలి గానీ"

"రాతగ్గవాళ్ళమీద వస్తుంది దయ"

"ఆ రాతగ్గవాళ్ళమీద తట్టలతో గుమ్మరించుకోండి వున్న దంతా, మా కక్కర్లేదు"

"అక్కర్లేనివా డెందుకు వచ్చాడూ?"

"అబ్బాయిమీదా నామీదా దయవుంది కనక పిలవడానికి వచ్చాడు, మీ దయకోసం కాదు"

"పిలు పెందుకో?"

"ఎల్లుండి సత్యనారాయణ వ్రతం చేసుకుంటున్నారు వాళ్ళు"

"ఏమిటో యెల్లుండి విశేషం?"

"మా లచ్చికి పుట్టినరోజూ, వాళ్ళకి పెళ్ళయిన రోజూను"

"...................."

"అతనికి తెలిసిన ట్టందచందా లెవరకి తెలుసునూ? మా లచ్చి కున్న సుఖమూ ఆనందమూ యెవరి కున్నాయీ మాలోను?"

"ప్రయాణం కాబోలు"

"కాక?"

"....................."

"మూస్తానా?"

"...................."

"మానగలనా?"

"...................."

"రేపొద్దున్న యెందు కయినా వాళ్ళు మన యింటికి రావాలా మళ్ళీ?"

"వెళ్ళకపోతే నువ్వేడుస్తావు, వెడితే నువ్వేడవాలి. కాస్తయినా మడీ మైలా అని వుందా? ఆగుడ్డలతో తింటాడు నానా—"

"ఊరుకోండి, వూరుకోండి నేర్చుకుపోయారు మహా! ఎంత సేపూ వుప్పు పిండీ కొయ్యరొట్టీ తప్ప మరొకటి యెరగని వాళ్ళకి రకరకాల పిండివంటల రుచి యేమి తెలుస్తుందీ? ఫలహారాలు టేబిలుమీద పెట్టుకుని కుర్చీలో కూచుని పుచ్చుకోవాలో, తడిగుడ్డ చుట్టబెట్టుకునీ పొయ్యిదగ్గిర చతికిలబడి మింగాలో యేమి తెలుస్తుందీ?"

"..............."

"కాకపోయినా, అంత యేడుస్తూ మీ రెందుకూ రావడం? అక్కడయేమీ చెడిపోదు, యిక్కడ యేమీ మిగిలిపోదు. అత్తిసరు వేసుకుంటూ యింటో కూచోండి చల్లగా, నేను మాత్రం వెళ్ళక తప్పదు 'కార్యం చిన్నది కదా మానేస్తారేమో, వల్లకాదు సుమండీ' అంటూ గడ్డం పట్టుకుని — బతిమాలు తున్నంత ప్రాధేయపడ్డాడు పాపం, సుందరం. వెళ్ళకపోతే నలుగురూ నన్నుఛీ అనరూ? కాకపోతే మీరు బాపన్న యింటికి—"

"మనిషంటే బాపన్నే మనిషి; గాని సుందరామయ్య—హుఁ!"

"అయ్యో దేవుడు చెప్పబోయి చెప్పబోయి బాపన్ననే చెప్పాలి, నల్లగా మసిబొగ్గు నయం"

"నలుపూ యెరుపూనా యేమిటి ప్రధానం? అతగాడు స్నానం చేసి—"

"భోజనాలవేళగా స్నానం అతనూ మీరూనూ? అప్పటిదాకా యింజన్లో బొగ్గుమనిషి లాగ అతనూ, గాడిపొయిదగ్గిర మనిషిలాగ మీరూ—"

"ఒక వీభూది పెట్టుకున్నా, వొక గంధం పెట్టుకున్నా బాపన్న—"

"అచ్చంగా, చారల కుండ కదూ?"

"..............."

"అతనికీ సుందరానికీనా తెచ్చారు సాపత్యం?"

"ఏమి తక్కువా?"

"రామయ్యతండ్రీ, యేజన్మలో చేసుకున్నామో నేనూ మా వెంకమ్మా ఘోరపాపం! లేకపోతే మా కర్మం యిలా కాలిపోయివుండదు"

"ఎప్పుడూ సుందర్రామయ్యకోసమే యేడ్చావు, చేసుకున్న పెళ్ళా మయినా—"

"చేసుకున్న పెళ్ళా మయితే మాత్రం, అనాకారపు— చాద స్తపు— కొంకనక్క మొగుడు దొరికితే యేడవదూ? చేసుకోకపోతే మాత్రం సుందరాన్ని చూసి వెంకమ్మా నేనూ—"

"ఆ, యీపాటికి వేషాలు చాలించు, యెవ రయినా వింటే తలవంపులు"

"అంత తలవంపుల కేం వచ్చిందీ? అందంగా వుంటే యెవ ర్తి మరిదిని యెవ ర్తి మెచ్చుకోకుండా వుండగలదూ? మీరూపం విరూపాక్షరూపం అయినం దుకు గింజుకోక అతగా డంటే అలా మొగం మాడ్చుకుంటారేం?

"..............."

"నావాళ్ళ నంటే నే నూరుకోను. నాచెల్లెలి నంటే వొకటీ నన్నంటే వొకటీనా?"

"బావన్న మాత్రం నీకు మరిది కాడూ? అత న్నెందుకన్నావూ నువ్వు?"

"అనక, ముద్దుపెట్టుకుంటారు మిమ్మల్ని అతన్ని. మరిదయితే మాత్రం, నా చెల్లెలే అతన్ని చూస్తే యేడుస్తూ వుంటుంది తెలుసా?"

"భర్త అంటే—"

"మరి భార్య అంటేనో?"

"..............."

"బ్రెవిభూది మాన మనీ, క్రాపింగు పెట్టించుకోమనీ, చొక్కాలు తొడు క్కోమనీ, పొగాకు నమలవ ద్దనీ, తెల్లవా రాటప్పటికి స్నానం చేసి చలవ మడతలు కట్టుకో మనీ, సంభావన్లకి తిరగవద్దనీ మాచెల్లెలు చిలక్కి చెప్పినట్టు చెబుతుంది గదా వినవద్దూ అతనూ? వదినగార్ల మాటా తీసెయ్యడమే?"

"మరి విద్య?"

"విద్యట విద్య, సంభావన్లకి దిరిగే విద్యే కాదూ?"

"అంత చదువూ చదువుకుని—"

"ఎంత చదువబ్బా? స్మార్తంముక్క లేనా కాకపోతే పరాయతం కూడా కాస్త అయింది కాబోలు, అంతేనా? ఓనవల చదవడు, ఓనాటకం చూడడు, చదవనైనా చదవడు. ఏంత సేపూ—"

"అఘోరించిన ట్టుంటుంది మీరు చెప్పినట్టు చేస్తే"

"ఇప్పుడే అలా వుంది సడసం. అంచేతే మా వెంకమ్మ నాలాగే సుందరాన్ని చూసి మనస్సు సరిపెట్టుకుంటూ వుంటుంది. మాలచ్చి అదృష్టమే అదృష్టం అనుకుంటున్నాం కనకనే మేమిలా అయినా వుండగలిగాం. అతను

కూడా మే మంటే ప్రాణం యిస్తాడు. మొన్న పిల్లాడి బారసాలకి వెళ్ళినప్పుడు రెండువేల మల్లెమొగ్గలు తెప్పించాడు మా ముగ్గురికీ. ముద్దూ మురిపెమూ అతనికి తెలిసిన ట్టెవరికి తెలుసునూ? బండయితే కుదుపనీ, మా ఉబలాటం చూసి యెవరిదో మోటారు తెప్పించి పంపాడు మమ్మల్ని ఎరగరూ?"

"ఎరుగుదు నెరుగుదును. ఇక నయినా వేషాలు కట్టిపెట్టు మర్యాదగా"

"ఎందు క్కట్టిపెట్టాలీ?"

"ఎందుకా? ఇక అతగాడితో వేళాకోళా లాడిచూడు నిలువునా చీల్చే స్తానో లేదో?"

"ఏమిటీ? చీల్చేస్తారా? నన్నా? ఎన్నివేల గుండె లుండాలీ అందుకూ? నామీద మీరు చెయ్యిచేసుకుంటే చూస్తూ వూరుకుంటాడేం అతను?"

"ఏం చేస్తా దేమిటి?"

"ఏంచేస్తాడో, యెల్లుండి వెడతాను గాదూ, రండి చూస్తురుగాని"

"వస్తాను వస్తాను తొందరపడకు"

"వచ్చి?"

"...................."

"అబ్బో! ఎంతెంత వూహ లున్నాయీ అవదాన్లుగారికీ?"

"...................."

"మీ కేమి విషం పెట్టా డనీ అత నంటే అలా వుడుక్కుంటారు? అతను పలకరిస్తే పక్కకి చూస్తూ మాట్టాడతారుట, యేం, మొగం చెల్లకా? కొరివిదయ్యం లా పుట్టినందుకు నూలమూలల వొదిగివొదిగి పడివుండక యెగిసెగిసిపడతారేం?"

"చాల్లెండి నేర్చుకోపోయారు. పాడుకళ్ళు మిటమిటలాడిసో—యేమి పాపమో గాని, మొన్న మా లచ్చితో మాటే సరిగా ఆడలేకపోయారుట, విషం పెట్టిందా అది? యజమాను లిద్దరితోనూ దుమదుమలాడుతూనే మాట్టాడతారు గదా, మళ్ళీ యే మొగం పెట్టుకుని బయలుదేరతారూ వాళ్ళ యింటికీ— నన్ను చీల్చెయ్యడాని కయితే మాత్రం?"

"మాలచ్చి వాలుజడ వేసుకుంటేనూ, గూడకట్టు కట్టు కుంటేనూ మీ బ్రాహ్మణ్యం బుగ్గయిపోయిందా? మా వెంకమ్మ కొప్పు పెట్టుకోడం బాపన్న చేత గంతులు వేయించారుట మీ సామ్మేం పోయిం దనీ? పుటంవేసినా మొగానికి కళ రాదుకదా యెందుకెందు కని వూరుకుంటోంది గానీ— 'క్రాసింగు పెట్టుకుంటే గాని నీమొగం చూడ' నని మావెంకమ్మ మంకుపట్టు పట్టిం దంటే మీ శిష్యుడి ఆట కట్టి వూరుకుంటుంది యేమయినా ఆలోచించుకున్నారా?"

"...................."

"నిక్షేపం లాగ మా సుందరం వూరందర్నీ పిలిచీ, చిన్న కార్యం అయినా బోగంమేళం పెట్టీ, రాచకొమారుడు లాగ పీటలమీద కూచుని వుండగా మా లచ్చి అతనికితగ్గ వేషం వేసుకుని యువరాణీలాగ అతనిపక్కన కూచుని వుండగా మా మొగాళ్ళమ్మా మహా చదివి బోర్లాతో శారని కొప్పులు పెట్టుకునీ, మడకచ్చాలు పోసుకునీ నుదురంతా కుంకుమ పులుముకునీ మూసివాయనపు ముత్తయిదువల్లాగ తిరగమా సభలో మేము? చూసినవాళ్ళు 'మీ మొగుళ్ళకి లేకపోతే పీడా పోయిరి, మీ కయినా సిగ్గు లేదా' అని మమ్మల్నాడి పోసుకోరూ? మి రంత చూడలేకపోతే యే సంభావనకో మరోవూరు వెళ్ళలేకపోయారూ?"

"ఆగొడవంతా యిప్పు డెందుకే?"

"ఎప్పుడు మాత్రం మాగొడవ మీ కెందుకూ?"

"...................."

"ఇంటో వుండి, వచ్చిన చుట్టానికి మర్యాదలు చెయ్యడం లేదు, వొక్కపూ టయినా వుండ మని బలవంతం చెయ్యడానికి నోరు రాదు, తీరా వెళ్ళిపోయాక మాత్రం 'యేడీ? అప్పుడే వెళ్ళాడేం?' అనడగడం మహా పెద్ద మనిషిలాగ"

"..............."

"అప్పుడు లేనివా రిప్పుడు మాత్రం యెందుకూ, అనాథలాగ యింటో కూచోక వంట అయేదాకా యెక్కడి కయినా వెళ్ళండి, నేను నిశ్చింతగా చేసుకుంటాను"

"వోసి నీయిల్లు—నువ్వెక్కడ దాపరించావే నాకూ?"

"ముద్దొస్తోంది నడక—ఇంకా గబగబా నడవండి . . . . . నన్నంటే నే నూరుకుంటానేం? అబ్బో, నాకు పిసాళం యెత్తుకు వచ్చిం దంటే మొగుడయిాది మొద్దు లయిాది చెలిగేసి విడిచి పెడతాను . . . . . అన్నట్టు మరిచి పోయాను, కంసాలిదుకాణం మీదికి వెళ్ళ మనవలసింది. ఎప్పు డయితేం, యీవెళడం వెళడం అక్కడి కయివుంటే సరే, లేకపోతే వెళ్ళి వచ్చేదాకా విస్తరి వెయ్యను దాంతో కుదురుతుంది చ—ప్పగా రోగం"

5

"ఇదిగో! . . . . వోయ్! . . . . ఏంచేస్తున్నా రండీ?" మిమ్మల్నే . . . . . , . . వినపడదూ? . . . . , అంగాస్త్రం పరుచుకుని అరుగు

మీద పడుకుని వుండగా చూశాను, మళ్ళీ యెక్కడికి వెళ్ళారమ్మా యింత ట్లోనూ?"

"...........“

"వెడితే వెళ్ళారు, కాస్త తలుపు దగ్గిరసావేసి వెళ్ళగూడదూ? కుక్క దూరబడితే యేమి చేస్తురో? ఓయ్.........ఈ చుట్టు పక్కల అయినా వున్నట్టా లేనట్టా?.....ఎక్కడికో దాటారు, ఏమండోయ్!"

"............"

"ఏకోటావధానులు దగ్గిరో, యేవళ్ళంభొట్లు దగ్గిరో కూచుని తద్దినాని కబుర్లు చెప్పుకోడమే కాదూ ప్రయోజకత్వం? పూర్వపువాళ్ళు ఆకాస్త మట్టయినా సంపాదించి వుండకపోతే, ఈపాండిత్యానికి తాగడానికి గంజయినా లేకపోవును......ఇదిగో, యేమండోయ్!"

"......వచ్చె వచ్చె, యెందుకా బొబ్బలూ?"

"బొబ్బలా? వంట అయేదాకా తొండలు విడిపించారే, యింతట్లోకే వేంచెయ్యాలా పెత్తనాలకి?"

"పెత్తనాలకే వెళ్ళానో, కంసాలిదుకాణంమీదికే—"

"దుకాణం మీది కయితే నాతో చెప్పారా? ఏం, అంత రహస్యమేం?"

"చెప్పివెడితే వొకటీ, చెప్పకుండా వెడితే వొకటీనా?"

"దేని కదే గాని రెండూ వొక టెలా అవుతాయీ?"

"..........."

"అస లెక్కడికో దయచేశారు, అవతలివాళ్ళు కనపడకపోగా పొడుం చేసుకోడానికి దుకాణంలో ప్రవేశించారు, నన్నుద్ధరించడాని క్కాదు"

"ఎలా గయితే యేం, యెందు కయితే యేం, దుకాణం మీదికి వెళ్ళాను, నీపనీ చూశాను, చాలదూ?"

"చూడ్డమే నిజమయితే, చంద్రహారం యేమట్టుకి వచ్చిందో చెప్పండి"

"వంట అయిందా?"

"చంద్రహారం తయా రయిందా?"

"నే నడిగినదానికి జవాబు చెప్పవేం?"

"నే నడిగినదానికి మీ రెందుకు చెప్పరూ?"

"..........."

".....దిగండి గుఱ్ఱం"

",...అయితే సాపుచేస్తున్నాడు"

"మొన్ననే చేశా దన్నారు సాపు, మీ మెలికలు చాలించండి"

"మొన్ననే ప్రారంభించాడు, యివాళ పూర్తి చేస్తానంటూ గూచున్నాడు, దీక్షగా"

"ఎప్పటికి తయా రవుతుం దన్నాడూ?"

"తొరగానే అవుతుందిట, వంట అయిందా?"

"ఎప్పు డిస్తా నన్నాడూ?"

"వంటయిందా?"

"ఎల్లుండి సుందరంగారి యింటికి వెడతా నని చెప్పారా మీరు?"

"తొరగా వడ్డిస్తే నిమిషంలో భోజనం చేసి వెళ్ళి అక్కడే—"

"దినమ్మా వడ్డించడం లేదూ తొరగా?"

"స్నానం చెయ్య మంటావా?"

"చెప్పివస్తారా?"

"భోజనం చేశాక వెళ్ళనూ?"

"మీరు చెప్పివచ్చాక వడ్డించనూ?"

"ఒక్క క్షణంలో యేమి మించిపోతుందీ?"

"ఒక్క తృటిలో యేమి దాటిపోతుందీ?"

"ఇక మరో మాట లేదూ నీకు?"

"మరి మరో ధోరణి రాదూ మీకు?"

"..............."

"..............."

"అదే చేస్తున్నాడు గదా?"

"అతని కిదొక్కటే కాదుగదా?"

"చెప్పివస్తే మాత్రం మరో పని మానాడా అతను?"

"ఇక్కడే వుండిపోయి, మీరు బతిమాలితే మాత్రం వడ్డిస్తానా నేను?"

"అదేమిటే, బోడితలకీ బొటనవేలికీ—"

"అదేమిటండీ, దేవతలకు పంచాంగం—"

".......... ...."

"..............."

"..............."

"కాస్త నిదానించు, ఆకలి దొలుచుకుపోతోంది"

"కూస్త వెళ్ళిరండి, పులుసు కుతకుతలాడిపోతోంది"

"దాని జోలి నా కెందుకూ? నా కది కావాలా యేమన్నానా"

"ఇందాకా వొప్పుకున్నా రేమో—"

"ఏడిశావ్?"

"సంతోషించార్"

"................"

"................"

"సరే, నీయిష్టం వచ్చినట్లల్లా బాధించు, నిన్న రాత్రి భోజనం సనిలేక, యివాళ యింతవరకూ భోజనం లేక కృశించి కృశించి—"

"మీ యిష్టంవచ్చినట్టూ యేడిపించండి, నాకు వస్తువు చేయించవలసి వచ్చాటప్పటికి నవనాడులూ కుంగిపోతాయి. ఇన్ని విధాల ఆడదా న్నేడిపించిన వాళ్ళు ముందుకి రారు"

"నే నిప్పుడు చేసింది—"

"తీరా, బంగారం యిచ్చేసిందిరా దేవుడా అని వొకటే రంధి మరేం చెయ్యాలీ? చూసిచూసి వస్తువు చేయించలేరు, చేయించుకుంటే కళ్ళతో చూడ లేరు. ఇంత కుచ్చితబ్బుద్ధీ, విషపుకళ్ళూ యెక్కడా చూడలేదు"

"దిక్కుమాలిన దండకం మళ్ళీ మొదలు, ఛా, నీమొగం యీడ్చా"

"నామొగం యెందు కీడుస్తారూ? మీవాళ్ళందరూ ఏ యేట్లో కలిశారూ? నన్నన్నారంటే బాగా జరగదు, మీరేమనుకుంటున్నారో గాని"

"ఎవళ్ళయినా వినిపోతారే, నవ్వుతారే"

"వింటే నాకేం భయమా? మీ యిష్టంవచ్చినవాళ్ళని తీసుకురండి యెవళ్ళకి బుద్ధి లేదంటారో?"

"ఏమిటీ? మాటలు మహా—"

"కోమటీ కొత్తబెల్లమూనూ. కొంటే డబ్బుఖర్చూ, తింటే కడుపునొప్పిని"

"................"

"ఇంకా చూసుకోండి కోరచూపులు. ఇంటో కూచుని ఆడదానిమీదే కాదూ అధార్టీ చెయ్యడం? వీధికి వెడితే గజగజలే"

"ఏమిటే యీ అల్లరీ?"

"అదే నేనూ అడుగుతున్నాను"

"................"

"ఒక్కమాటు దుకాణంమీదికి వెళ్ళిరమ్మంటే యింతరట్టూరవ్వానా?"

"ఇప్పుడే కాదూ—"

"ఇక్కడే కాదూ—"

"........ ...."

"సందు మళ్ళితే కోమటి దుకాణం, అది దాటితే శంభులింగం దుకాణం, అంతేనా?"

"అదిగో సుత్తిదెబ్బలు వినపడుతూనే వున్నాయి. అంత గట్టిగా సాగ కొట్టవలసిందేముంటుందీ చంద్రహారానికి? మీరిలా మొగం తిప్పారు, అతనలా పని తిప్పేశాడు"

"నువ్వు మనిషివా దున్నపోతువా?"

"ఎలాంటివాళ్ళ కలా కనపడతాను"

6

"అభిఘరించాను"

"అఘోరించలేకపోయావు"

"నాకేం పట్టిందీ, యిప్పటిదాకా మీరే చేశా రావని, జ్ఞాపకం చేసుకోండి"

"……………"

"…………"

"కాస్త నెయ్యి రాల్చు"

"రాల్చడం కాకపోతే పురిసిళ్ళకోద్దీ యెలా వస్తుందీ? పొలాలు అమర్చుకునేటప్పుడు వట్టిగడ్డి నిరుకుచేసుకోడం చేత కాకపోయె మనకి"

"……………"

"లేగదూడకి చెంగలిపరకలు తేవాలన్న జ్ఞానం కూడా లేకపోయె మనకి"

"కాస్త మాట అనేటప్పటికి—"

"అనకపోతేం, అనిపించుకోకపోతేం?"

"పీటమీదికి వచ్చాటప్పటికి రుసరుసలు మొదలు. తిన్నగా కూచుని చక్కగా భోజనం చెయ్యడం చూడలేదు నేను"

"నువ్వేం వడ్డించావనీ?"

"మీరేం వండనిచ్చారనీ?"

"ఏమీ లేనేలే దంటావా యింటో వండడానికి?"

"అదా యిదా అనడిగితే అది గడ్డనీ, యిది తుక్కనీ సూకరాలు పోయారు గాని ఫలానా వండ మనగలిగారా మీరు?"

"నిజంగానే యేమీ లేదూ?"

"ఏమిటేమిటో తెచ్చి యింటో మీరు గుట్టలు పేర్చినట్టూ, నేనే బద్ధకించి వండనట్టూను. కదూ?"

"పెండలం యేమయిపోయిందీ?"

"ఇంకోటి చెప్పండీ మీరు తెచ్చిందేమిటో?"

"..........."

"సుందరంగారి కొట్టుగది చూడండి యెన్ని రకాల కూరలు సిద్ధంగా వుంటాయోను?"

"చెన్నపట్నం వెళ్ళాడంటే రకరకాల కూరలు తెస్తాడతను. కేబేజీ—కేరట్ — నూల్‌కూల్ — టొమాటో — గాలీఫ్లవరు — పేర్లయినా విన్నారా మీరు?"

"నువ్వు విన్నావు మహా. నోరు తిరగని అక్షరాలు నాలుగు కలిపి పాస్‌పీస్ మంటే, యింగ్లీషు రానివాళ్ళ దగ్గిర, సగంసగం నేర్చినవాళ్ళకంతా యింగ్లీషే. నాదగ్గిర చెబుతావు నీమరిది పాండిత్యం?"

"మీరు శాలువులు కప్పుతారనీ మీయింటికి వస్తే పది కూరలతో విందు చేస్తారనీ"

"పదికూరలుట! ఒక్క పెండలంచాలు ఇరవై కూరలపెట్టు"

"ఎంతసేపూ పెండలం పెండలం దాని మొగం మండేరి, రుచావటా?"

"అంతా యెలా తింటున్నారూ?"

"అంతా ఆవపెట్టుకుంటారు తెలుసా?"

"బెల్లంపెట్టి వండుకునేవాళ్ళు మాత్రం లేరూ లోకంలో?"

"ఒకటే కూర మొగుడికో రకంగానూ, పెళ్ళానికో రకంగానూ చేసుకునే వాళ్ళు వున్నారా లోకంలో?"

"........"

"కాకపోయినా, పదిరోజుల కిందట మాతమ్ముడు వచ్చినప్పుడు నాలుగు ముక్కలు వేయిద్దామని యిట్టే తరిగాటప్పటికి— రామరామా! ఇప్పటికీ పోలేదా దురదలు. ఎక్కణ్ణుంచో రాక్షసిపెండలం తెచ్చిపడేశారింటో"

"పెరట్లో కావలసినంత తోటకూర—"

"చీడ నాకెయ్యలేదూ?"

"కాడలో?"

"ముదిరిపోలేదూ?"

"పోనీ, పప్పుపులుసు—"

"పోనీ, అందులో రెండుల్లిపాయలు. ఏం?"

"నీకూ నాకూ సమంగా పనికివచ్చేవి—"

"మాట అనడమే కాని, యేమున్నాయీ? కాకరకాయచేదు. పొట్లకాయ గబ్బు ఆనపకాయ చప్పన. దొండకాయ శ్లేష్మం పెంచుతుంది. కంద వేడి, అరటికాయ మలబద్ధం కలిగిస్తుంది. బీరకాయ మొగం మొత్తింది. గుమ్మడుకాయ వాతం చేస్తుంది. అవునా?"

"........"

"కూరలకోసం యింత దేవుళ్ళాడేవాళ్ళు కాకినాడ వెళ్ళి గోరుచిక్కుడి కాయలు తెచ్చుకోకుండా వస్తారా? రాజమహేంద్రం వెళ్ళినవాళ్ళు ఆగాకర కాయలు తెచ్చుకోకుండా వస్తారా?"

"లక్షమాట్లు పోరాను. శతవిధాలా బతిమాలాను. ఒక్కమాటయినా బంగాళాదుంపలు తేగలిగారా?"

"దేవతార్చనపరులందరూ పీటమీద కూచుని జపం చేసుకుంటారు— మీరు తప్ప"

"రేపణ్ణుంచి నేను వండుతాను, నువ్వు కూచుని తిను"

"వో, అంతకంటేనా? మూడో మేలు!"

"పోనీ, వంట తప్పింది కదా అని సంతోషిస్తావా నువ్వు?"

"సంతోషించనక్కరలేదు, రకరకాలు చేసిపెడితే తిని వూరుకోడ మయినా చేతవునా మీకు?"

"పాడు పుల్లిపాయలు కొంపలోకి రాకుండా చెయ్యాలి గాని—"

"ఓహో, అలాంటి వుద్దేశం వుందీ యేలినవారికి? అబ్బో! అలా అయితే మీతరమే కాదు, మీతాత తరంకూడా కాదు, తెలుసా?"

"........."

"ఎందుకెందుకని వూరుకుంటున్నాను గాని, నాకు పట్టుదల వచ్చిం దంటే మీచేత తెప్పిస్తానవి బజారునుంచి"

"........"

"రోజూ నాతిండినిగురించి మీరు గోల పెడుతూ కూచున్నారంటే, చివరికి, మీచేత తినిపిస్తానవి యేమనుకుంటున్నారో?"

"........"

"ఊళ్ళో యిన్ని బ్రాహ్మణకొంపలున్నాయి గదా, యే కొంపలో నయినా తిండికోసం యింత రగడ పెరగడం వుందా?"

"........"

"ఏమి వండుకుంటున్నారో, ఏమి తింటున్నారో, తినేవాళ్ళకి దేవుడికి తప్ప మూడో కంటివాడికి తెలుస్తోందా?"

"........."

"నేనమ్మా దేవతార్చన వెలగబెడుతున్నానని బుజా లెగర వేసుకుంటు న్నారే గాని, సంసారం వీధిలో పడిపోతోందని గుర్తించుకుంటున్నారా మీరు?"

"........."

"ఏదీ, సిగ్గుబిడియాలున్న యే మొగాడు మాట్టాడతాడో మీ పక్షం, రమ్మనండి చూతాం"

"........."

"ఇంతాచేసి పైవాళ్ళ మెప్పుకోసం గదా దేవతార్చన, యింటో కూడా యింత భాగోతం నడిపించాలా?"

7

"చాప వేస్తున్నా రెందుకూ?"

"ఒక్క కునుకు"

"దుకాణంమీదికి వెళ్ళరూ?"

"వెళ్ళనూ?"

"ఏడుకొండలవాడా అంటూ వీధిలో దొర్లుకుంటూ వెడతారూ కొందరూ, అలాగా?"

"..............."

"అన్నం పెట్టేదాకా నన్ను మీరు నిలవనిచ్చారు కారు. నాలుగు మెతుకులూ కంఠం దిగాటప్పటికి పెద్దమ్మ మిమ్మల్ని నిలవనివ్వడం లేదు, అవునా?"

"నువ్వు పెట్టిన పంచభక్ష్యపరమాన్నాలూ ఆరగించాటప్పటికి"

"ఇలాంటి మొగాలకే ఆలాంటివి"

"..............."

"వేషాలకి పోక దుకాణంమీదికి వెళ్ళండి తొరగా"

"..............."

"చాప చుట్టండి ముందు"

"..............."

"వద్దు... వద్దు... సాహసం వద్దు"

"వీధి అరుగుమీద పడుకోడం గదా, వచ్చిపోయేవాళ్ళు చూసిపోతారని భయపడి నేను వెనకతియ్యకపోతానా అనుకుంటున్నా రేమో, తరవాత గింజుకోవలసి వస్తుంది, ఆలోచించుకోండి"

"..............."

'వద్దంటాను...వద్దంటున్నాను...వద్దన్నాను"

"అయితే, శంభులింగం భోజనం చెయ్యాలంటావా అక్కర్లే దంటావా?"

"మీలాగ ఝాముసేపు నీళ్ళు నమల డతను. కాకపోయినా, చద్దన్నం తినేవాళ్ళు వొంటిగంట దాటితేగాని భోజనానికి లేవరు"

"నీ నగల వుబలాటమేనా నాకష్టసుఖాలు చూడ్డం యేమయినా వుందా?"

"దుంగ లెత్తానా దూలాలెత్తానా, పొద్దుమ పీల్చుకుంటూ కూచోడమే కాదూ అక్కడా?"

"..............."

"అంగాస్త్రం కూడా పరుస్తున్నారు వద్దుసుమండీ"

"..............."

"వినపడదూ?... మిమ్మల్నే... ఓయ్!"

"..............."

"పడుకోడానికి వల్లకాదు"

". . . . ."

"మానరు కాదూ?"

". . . . ."

"ఇంత మొండికెత్తితే యెలాగమ్మా వేగడం?"

". . . . ."

"మానరు...మానరు...మానరు"

". . . . ."

"ఇదిగో, ఓయ్, ... నల్లరాయి! . . . . ఏమండోయ్, మిమ్మల్నే . . . వెళ్ళనని చెప్పడాని కయినా నోరు విడదూ?"

". . . . ."

"నామాట కొట్టేసి, నాకు బదులయినా చెప్పకుండా మీరెలా నిద్ర పోతారో చూస్తాను కాదూ?. . . మొండివాడు రాజుకంటే బలవంతుడుట. చెవిటి వాడి ముందు శంఖం వూదితే 'అది కొరకడం నీ తరమా నీ అబ్బతరమా?' అన్నాడుట. వెర్రివాడికి పెళ్ళాం దొరికితే గిల్లిగిల్లి చంపాడుట. 'ప్రజ్ఞకి పెళ్ళాడానుగాని, కూడుపెట్టడం మా కులంలోనే లే'దన్నాడుట. మానాన్న వద్దుమొర్రో అంటూనే వున్నాడు, మా అమ్మ వెలగబెట్టిం దీ సంబంధం. అనుక్షణమూ దాని జీవానికి పడి యేడుస్తూనే వున్నాను నేను. పెళ్ళామనీ, బిడ్డలనీ, అచ్చటన్నీ, ముచ్చటనీ, ముద్దనీ మురిపెం అనీ, కష్టమనీ సుఖ

మనీ— యేమయినా తెలిస్తేనా జన్మకి? ఊరికే పెళ్ళాందగానే సరా? అసలీ వంశమే యిలాంటిది. తాతముత్తాతల దగ్గిర్నుంచీ వస్తోందిట పెళ్ళా న్నేడిపించడం యీ పాడుకొంపలో. ఇంత కొయ్యతనం యెక్కడా చూడలేదు. ఎన్ని మాటలన్నా దున్నపోతుమీద వాన కురిసినట్టే—"

"హోసి నీయిల్లు—"

"మీయిల్లే, మీబతుకే, అదేదో మీకే"

"నోరు మూస్తావా ముయ్యవా?"

"మీ చేతు లేమయిపోయాయి?"

"........."

"........."

"పడుకోనివ్వవుటే?"

"సుందరంగారి యింటికి వెళ్ళాటప్పటికి నాకు చంద్రహారం రానివ్వరూ?"

".........."

"నా మాట వినండి. ఇవాళా రేపూ కష్టపడితే చంద్రహారం అయిపో తుంది. తరవాత, నేను సుందరంగారి వూరు వెళ్ళాక వారంరోజులు రాత్రీ పగలూ ఏకనిద్రపోవచ్చు, మధ్యమధ్య వులిక్కిపడి లేచి అత్తిసరు వేసు కుంటూ"

"ఒక్కక్షణం నిద్రపోకపోతే నాకు తలనొప్పి వస్తుందే"

"చెప్పగానే వినకపోతే నాకు వొళ్ళు మండుకుపోతుందండీ"

"ఊరికే పడుకున్నానని పేరు. నువ్వు భోజనం చేసివచ్చాటప్పటి కిక్కడ వుంటే అడుగు"

"ఊరికే సద్దిచెబుతున్నానని పేరు. మీరు లేచి దుకాణం మీదికి వెళ్ళేదాకా మీకు మతివుండనిస్తే అడగండి"

"ఓసి నీపట్టుదల"

"అయ్యో మీ మొండితనం—"

"నన్ను వేపుకుని తినకే"

"నన్ను రాసి రంపాన పెట్టకండీ"

"నీ కెంతయినా పుణ్యం వస్తుందే"

"మీ కెంతయినా పాపం చుట్టబెట్టుకుంటుం దండీ"

"నా పాపం బద్దలాసిపోబట్టే నిన్ను కట్టుకున్నాను"

"నా పుణ్యం బుగ్గయిపోయింది కనకనే మీ యింటో పడ్డాను"

".........."

"నా కిలాంటి యమచర రాసిపుంది కనకనే నెత్తిమీద పెట్టుకునేవా ళ్లెంతమంది వచ్చినా—బతిమాలినా, వాళ్ళనందరినీ కాదని మా అమ్మ నా గొంతుకోసింది. అసలు పెళ్ళిలోనే రోతపుట్టింది నాకు పొడుంబుర్రా పిలక జుట్టూ చూశాటప్పటికి"

"........."

"అయింది. కుంభకర్ణుడి విగ్రహం వొరిగింది. ఇక దీపాలు పెట్టాకే కళ్ళు తెరవడం, మళ్ళీ లేచి కూచునేటప్పటికి కుంభం సిద్ధంగా వుండాలి"

"........."

"మంచి మనిషికో మాటా మంచి పశువుకో దెబ్బాను. మనిషిజన్మ యెత్తగానే సరా?"

"వోసి నీయిల్లు—ఇందాకణ్ణుంచి చూస్తున్నాను, వొక్క మోస్తరుగానే పేగులు తోడేస్తున్నావు. నువ్వు నా కెక్కడ దాపరించావే నీ మొగం యీడ్చా—దుకాణం మీదే పడుకుంటాను వెళ్ళి, యిక తన్నుకు చావు"

"నాకేం చచ్చేదాకానూ? మా కుదుట్లో అర్థాయుష్య ప్పీనుగు లెవరూ లేనూ లేరు, మమ్మల్నన్నవాళ్ళు ముందుకి రానూ రారు... ఇదిగో చెబుతున్నాను. అప్పలమ్మని పంపి కనుక్కుంటాను, అక్కడయినా సరే నిద్రపోయారంటే రాత్రి మీరు చెయ్యవలసిందే వంట. వెళ్ళండి, వెళ్ళండి— మీ వేషాలు సాగనిస్తా ననుకున్నారు పా—పం"

8

"వీధిలో వేశావేం మకాం?"

"అప్పుడే వచ్చారేం యింటికి?"

"ఏం, రాకూడదూ?"

"ఏం, అడక్కూడదూ?"

"పచ్చిమంచినీళ్ళయినా తాగవద్దుటే?"

"పచ్చివేం కర్మం, పండువే పుచ్చుకోండి నాకేం?"

"ఏడిశావు"

"ఏమిటీ? మహా చురుగ్గా వుందే యివాళ వ్యవహారం?"

"ఉండక? నీకు లొంగుతా ననుకున్నావు, మొగపుట్టుక పుట్టి—హుం!"

"లొంగక? ఆడదా మనుకుంటున్నారు కామోసు ఆట, జుట్టు చేతి కిచ్చి—హీ!"

"చాలిం చీపాటికి. కసిన్ని మంచినీళ్ళు పట్టుకురా ముందు"

"గుర్రం దిగండీపాటికి. అప్పలమ్మని రానివ్వండి ముందు"

"కంఠం ఆర్చుకుపోయి వస్తే—"

"బతిమాలి బతిమాలి దాన్ని పంపిస్తే—"

"నా దాహానికి అప్పలమ్మకి సంబంధం యేమిటే?"

"నా చంద్రహారానికి మీదాహానికీమాత్రం సంబంధం యేమిటండీ?"

"అదేమిటే నీ మొగం—"

"ఆగండి. మాటలు మిగిలారంటే చెలిగేస్తా నేమనుకున్నారో? దండకం విప్పా నంటే, ఆవిసురు మీ తాత ముత్తాతల దాకా వెడుతుంది, యేకధాటిని"

"..............."

"మీ రక్కడ నిద్రపోయారో కూచునే వున్నారో తేలకుండా నేను మంచినీ ళ్ళలా యిస్తా ననుకున్నారూ, పడివుండండి కాస్సేపు"

"ఏదయినా దెయ్యం పట్టిందా యేమిటే యీవాళా?"

"దయ్యమో భూతమో మిమ్మల్నే పట్టింది చూసుకోండి బాగా"

"ఎంత మొండికెత్తావే?"

"ఎంత బండ కెత్తారండీ?"

"నువ్వే యివ్వాలా? నేను పుచ్చుకోలేనా?"

"అయ్యో, పుచ్చుకోలేకేం? పుట్టింది మొగ పుట్టుక కదా?"

"తొందరపడకు"

"వేగిరపడకండి"

"..............."

"ఇదిగో, దుకాణంమీద కూచున్న బట్టలతో ముట్టుకుంటారు కామోసు నిండుబిందె. నాకేం, రాత్రికి మీ కవే మంచినీళ్ళు, పుచ్చుకోండి"

"..............."

"నూతికి వెళ్లారు. కావాలి, శాస్తి"

"..............."

"..............."

"సిగ్గు లేకపోతే సరీ నవ్వడానికి"

"చేతగాని పని చేసుకున్నందుకు మీ కుండాలి ఆసిగ్గేమిటో, మధ్య నా కేం?"

"సాగుతోంది అంద్రదబ్బ, ఎందు కెందుకని వూరుకుంటూవుంటే నెత్తి కెక్కుతున్నావు"

"ఎక్కడికి? కాళ్ళకింద పెట్టి రాసేద్దా మనుకుంటున్నట్టున్నారు, దేవతలు దిగిరావాలి"

"చూస్తువుగాని"

"మీరూ చూస్తురుగాని"

"…. ……….."

"ఇక రెండేళ్ళు పోనివ్వండి, అబ్బాయి నప్పగిస్తాను"

"వాణ్ణి కూడా పాడు చేస్తావు నువ్వు. వేలెడు నిర్భాగ్యుడున్నాడు, వారి కప్పుడే వుల్లిపాయలు మప్పేశావు"

"మీరు నల్లవుద్దరి తినండి, మాకేం? నిక్షేపంవంటి నాయన్ని తిట్టుకుంటారేం? మా నాన్న పేరు పెట్టుకున్నా ననీ ఆ వుక్రోషం"

"……………"

"ఇవాళ రాత్రి మొదలు పట్టుపంచె కట్టుకుని వంటచేస్తాను, మీ రిలాగ వేశాలు వేశా రంటే, వోః! ముక్కు మూరెడు చేసుకుంటేనూ, మూతి ముడుచుకుంటేనూ నేను వొణికిపోను"

9

"తలుపు తలుపు"

"……………"

"ఓయ్"

"……………"

"ఏంచేస్తున్నావ్?"

"……………"

"ఇదిగో"

"……………"

"వినపళ్ళేదూ?"

"……………"

"ఔనే?"

"……………"

"ఇంటిదానా"

"……… … …."

"నిన్నే"

"……………"

"తలుపు తలుపు...ఓహోయ్!...ఎక్కడున్నావే?... ఎక్కడి కయినా వేంచేసినట్టా?...ఇంటోనే వుంది, యేమి చేస్తోందో కాని"

"........"

"ఏం, వినపళ్ళేదుటే?"

"........"

"మడికట్టుకుందో, కొంపతీసి నాచేత్తో కట్టిస్తుందో? అనాచారంబాధ వచ్చి పడింది; గాని అమృతమే యేమి వండినా. మడి అంటేనే మండిపడుతుంది గానీ, శుచీ శుభ్రమూ ఎక్కువే. కోపం రానంత సేపూ ప్రాణం యిస్తుంది. వస్తే మాత్రం వెనకా ముందూ చూడదు. మంచితనం క్షణమూ దినమంతా మంకు తనమూను. కోపం యెందుకు వస్తుందో, యెప్పుడు వస్తుందో, వచ్చి యెంత సేపుంటుందో తెలవదు, ఉన్నంత సేపూ మాత్రం గజగజ లాడించేస్తుంది. ఎప్పటి కప్పుడే తా అనిపిస్తూ వుంటుంది, కానయితే నేను పట్టుదల విడిచిపెట్టలేకుండానే వున్నాను... ఛీ, ఆడదా న్నెలా గయినా వొంచాలి గానీ — యేం వినపడదూ?"

"........"

"అబ్బాయీ?"

"........"

"నాయనా!"

"........"

"బుల్లేడా?"

"........"

"కుర్రాడా?"

"......

"రామచంద్రావధానీ!"

"........"

"ఓహో, అలా పిలిస్తే వాడూ పలకడు, అదీ పలకనివ్వదు, వినపడ లేదు నయమే, రామచంద్రరావ్"

"................"

"దిక్కుమాలిన కర్మం, కోపమో వినపడకపోవడమో— ఓసి నీమొగం—"

"ఏమిటా బొబ్బలూ?"

"బొబ్బలా?"

"పెదబొబ్బలు—తక్కువేం?"

"జాము సేపణ్ణుంచి అరుస్తూ వుండే—"

"ఎవ ళ్ళరవమన్నారూ తీరి కూచునీ?"

"ఎక్కడికి పోయావూ?"

"ఎవళ్ళతో నయినా లేచిపోయాననా మీ రనేది?"

"ఏమిటా మాటా?"

"ఏమిటీ లోటూ?"

"..............."

"మీ బొబ్బలతో కమ్మగా నిద్రపోతున్న చిట్టితండ్రి వులిక్కిపడి లేచాడు, మళ్ళీ నిద్రపుచ్చాటప్పటి కింత సేపయింది తెలుసా?"

"..............."

"పెరట్లో పడి పనిచేసుకుంటున్నాను గదా, స్వాములు వేంచేస్తారని తలుపులు బార్లా తెరిచివుంచనా?"

"...... ...."

"కాస్సేపు అరుగుమీద కూచోగూడదూ, వాకచే అరవడమా చెవికోసిన మేకలాగ"

"..............."

"మీగోలకి వీధే పోయేవాళ్ళు నవ్వుకుంటారని యింగితజ్ఞాన మయినా వుండవద్దూ?"

"..............."

"సరే, యింటో ప్రవేశించడానికింత తొందరపడ్డారు మరి, వంటింటో కూడా అంత తొందరగానే ప్రవేశించండి"

"అదేమిటీ?"

"అదే"

"అంటే?"

"అంటేనా? ముందు పొయ్యి రాజేసుకోడం. తరవాత వొళ్ళు రవల బెట్టుకుంటూ వెళ్ళి స్నానంచెయ్యడం. చివరికి, తడిగుడ్డలతో పొయ్యిదగ్గిర చతికిలబడి—"

"తెలిసింది, అదంతా యేమి టంటాను"

"వినపడింది, అదంతా యిందాకానే చెప్పానంటాను"

"అంతే?"

"ఇంతే?"

"నిద్రపోవడం నిజమే; కాని—"

"కనక, గొడవలు పెంచక తొరగా—"

"నిజం చెప్పినా పట్టుదల మానవూ?"

"పాడుపని చేసి నిజం చెబితే మాత్రం పోరిగిందేమిటీ?"

"..............."

"కాకపోయినా, మీరు చెప్పకపోతే మాత్రం నిజం దాగుతుందా? పట్ట పగలు—మిడసరిలగ్నంలో—నడివీధిలో— నలుగురూ వచ్చేపోయే కంసాలి దుకాణంలో—సాక్షాత్తూ—"

"బుద్ధి తక్కువయి నిద్రపోయాను, సరా?"

"బుద్ధి యెక్కువ చేసుకుని పొయ్యిదగ్గిరికి వెళ్ళండి"

"నేను నిద్రపోయినా అతను పని మానలేదు"

"మీరు చూశారన్న మాట"

"మేలుకున్నంత సేపూ—"

"సరే, అప్పుడు కూడా కళ్ళు మూసుకుపోవాలా?"

"రామరామా!"

"చేసేది పార్థివం, శివశివా అనుకోండి"

"..............."

"..............."

"అయితే, యేమి చెయ్యమంటావో చెప్పు, ఇంకెందుకూ?"

"పోనీ, మీ రెంత సేపు నిద్రపోయారో చెప్పండి, మరెందుకూ?"

"క్షణం—అరగంట మించదు"

"దానికి పరిహారం యేమిటో అదీ మీరే చెప్పండి"

"పరిహారం అంటూ యెందుకూ? సంసారం అయిన తరవాత యేదో మంచీ చెడ్డా—"

"రెండూ కలపకండి"

"పోనీ, చెడ్డే జరుగుతూ—"

"ఆచెడ్డకే పరిహారంతెలిసిందా?"

"ఏదో విధంగా సద్దుకుపోవడమే"

"అలాగటండీ?"

"అవును"

"ఊహూ!"

"..............."

"తరవాత చూసుకుందాం, ముందు మడి కట్టుకోండి"

"మళ్ళీ మొదలా?"

"అది కాకపోతే మరేమిటో మీరే చెప్పండి"

"పరిహారం మాటే విడిచిపెట్టాలి గాని లేకపోతే మరోటెందుకూ?"

"మరోటి మీకూ వద్దు నాకూ వద్దు, కనక మడి కట్టుకోండి"

". . . సరే . . కట్టుకునీ?"

"వంట చేసెయ్యండి"

"చేసి?"

"వడ్డించండి ముందు నాకు"

"........"

"ఏం, వులిక్కిపడ్డారేం?"

''.....సరే వడ్డించి?''

''తరవాత సద్దుకుపొండి లక్షణంగా''

"........"

"ఏం, తెల్లపోతారేం?"

"..............."

"ఇది సంసారమండీ! సాగరంకంటే యెక్కువదండీ! కష్టసుఖాలు కలిసే వుంటాయండీ! రెండూ వేస్తే చప్పుడండీ! పెద్దవాళ్ళు వొరిగేసుకు పోవాలండీ!

"..............."

"మాట రాదేం?"

"ధర్మం.—"

"మళ్ళీ అదొకటుందీ?"

"..............."

"ఓ!!"

"..............."

"మన మేమో తోచిన ట్లల్లా చేసేస్తూ వుండాలి. ఎదటివాళ్ళు మాత్రం చచ్చినట్టు సద్దుకుపోతూ వుండాలి. ఇదీ ధర్మం. త్రికాల జ్ఞానసంపన్ను లయిన మహర్షులు పద్మాసనాసీనులై వరదహస్తం యెత్తి ఆడవాళ్ళ నెత్తిన రుద్ద మని పురుషుల కుపదేశించిన వేదసారం యిదీ, కదూ?"

"..............."

"సిగ్గులేక ధర్మవన్నాలు. నిలవతీసి అడిగేవాళ్ళు లేక ధర్మోపన్యాసాలు"

"...............''

"బెల్లంకొట్టిన రాయి లాగ వూరుకుంటే గాదు, ఏదో తేలిపోవాలి"

"మరి తేల్చెయ్యి"

"మడి కట్టుకోండి"

"మరో శిక్ష చెప్పు"

"ఉల్లిపాయల పులుసు వేసుకుంటూ ఉండండి"

"ఇంకొకటి"

"అవున్న పిలక కాస్తా కత్తిరింపించుకుని—"

"కొంచెం దయవుంచు మరీ"

"అయితే, పొడుం పీల్చడం కట్టిపెట్టండి"

"అది బాగుంది"

"ఏదీ, పొడుంకాయ—"

"ఉండు, ఒక్కపని చెయ్యి"

"ఏమిటది?"

"అరగంట నిద్రపోయాను కనక, వొక్క గంటసేపు పొడుం పీల్చ కుండా వుంటాను, అలా వొప్పుకో"

"పనికిరాదు, నాలుగ్గంటలు—"

"చంపేశా మన్నమాట"

"అంత నొప్పిగా వుందా? ఇందాకా నే నెంత బాధపడ్డానో? వొళ్ళు మండుకుపోయిందే? అదంతా మీ కిప్పు డనుభవానికి రావద్దూ?"

"మొగాడైనవాడి కిది చాలదూ?"

"ఆడదాని అక్క స్సింతటితో తీరుతుందా? నయాన—భయాన ఎంత చెప్పినా విన్నారా?"

"అలా కాదు, కొంచెం శాంతించు. ఉండుండి వొక్కమాటు చర్రు మంటూ వుంటావు గాని నిజానికి నీఅంత మంచిది లేదు, దిక్కుమాలిన ఆచారం దగ్గిర వస్తోంది నీకూ నాకూ జగడం"

"ఆచారం దిక్కుమాలిన దని తెలిసివుండిన్నీ అదంటే అంతగా దేవుళ్ళాడటా రెందుకూ? పైకి వెళ్ళినప్పు డెలా అఘోరించినా యింటో వున్నప్పుడు కూడా యెత్తెత్తి కాళ్ళు వేసుకోవాలా?"

"మా నాయనా, నా కింగ్లీషు చెప్పించకపోయే. నకా మరో వృత్తి చేత కాకపోయె"

"చేతకాకపోవడమేం? పొడుం పీల్చడం చేతకాలేదూ? అది మీ నాయనకు చేతకాదుగా? ఆయన మీకు నేర్పించలేదుగా?"

"పోనీ, అలాగే అను. మరిప్పు దేమి చెయ్యమంటావు?"

"అలా అడిగారు బాగుంది, చెబుతా వినండి. ఈకొంప తెగనమ్మేసీ, యీ సంభావన్ల విద్వాంసులను విడిచిపెట్టేసీ సుందరంగారి వూరు వెళ్ళిపోదాం రండి. వాళ్ళ యింటి వెనక వున్న డాబాయిల్లు అమ్మకానికి వచ్చిందిట లేవండి. సుందరాన్ని బతిమాలి అతని బట్టలకొట్టులో అబ్బాయికి వాటా యిప్పిస్తాను, మనం రాజాంగంగా బతకవచ్చు పదండి"

"నువ్వెంతదానవు కాదని కాదు. కాని ముందుమాట అలావుంచు. నేను నిన్ను తిడుతున్నానే అను. అయినా, ఆతిట్లు నాభిదగ్గిర్నుంచి వచ్చేవి కావు నమ్ము. నాదీ తాటాకుమంటే. ఒక్క క్షణం నిద్రపోకుండా వుండలేకపోయాను గాని చంద్రహారం వేసుకుని నువ్వు కలకల్లాడుతూ వుంటే నేను చూడలేనూ"

"అయ్యో, దేవుడ ! మీ చూపే చెప్పకోవాలి"

"పోనీ, అది నాకు గొప్ప కాదంటావా?"

"ఇందాకా యే మయిం దాగొప్ప?"

"ఇందాకానూ గొప్ప కేమీ భంగం రాలేదు, బాగా నిదానించు నన్నేడ్పించకు"

"ఈనక్క వినయాల కేం లెండి?"

"అయితే, యిదంతా నటన అనే నీవూహ?"

"కాక? ఏడ్పు మనిషి నెంత దిగతీస్తుందో అనుభవిస్తే గాని మీ కెలా తెలుస్తుంది?"

"................"

"................"

"తప్పదూ?"

"తప్పదు. తప్పదు. తప్పదు"

"అయితే, పొడుంకాయ ఇచ్చేస్తాను"

"తెండి"

"ఉండుండు............"

"బాగా ఆలోచించుకోండి వంటలోకి వెడతారా, మీకున్న చాదస్తం అంతా వినియోగపరచుకోవచ్చు. పొడుంకాయ యిచ్చేస్తారా, నేను మాసుందరం గారి యింటికి వెళ్ళాక మాటిమాటికీ తెగపీల్చుకోడానికి మీ కెంతయినా ఝిగుల్తుంది"

"ఇదిగో పొడుం కాయ పుచ్చుకో, అయితే, నువ్వు వంట చేశాటప్పటికి నేను చెరువుకి వెళ్ళి సంధ్యావందనం—"

"కట్టిపెట్టండి వేషాలు. మీనాన్న దగ్గిరనుంచీ యెరుగుదును! విస్తరిముందు కూచునే మీయింటో సంధ్యావందనాలు. ఇవాళ చెరువుకి వెళ్ళవలసివచ్చిందేం మీకు? వీధిగుమ్మం కూడా తొక్కచూడనివ్వను, ఇంటోకి పదండి"

"అంత అనుమానం—"

"కాక? అలా వెళ్ళి యే సర్వయ్యనో అడిగి రెండుపట్లు తెగపీల్చ డానికా? ఓ—హో—కదిలా రంటే మాట తక్కదు మరి"

"నీ వెఱ్ఱే గాని పొడుం భాగ్యానికి దేహీ అని చెయ్యి చాపడం గౌరవమా?"

"ఓస్, ఏమి ప్రతిష్ఠ? పొడుం పీల్చే వాళ్ళ బతుకే చెయ్యి చాపడం. ఎక్కడ లేని మందహాసమూ వచ్చి కలకల్లాడిపోతుంది ముఖారవిందం, నే నెరగ నమా?"

"అదంతా యెందు గ్గానీ—వంట కాగానే యిస్తావా?"

"ఇలా భోజనం చేసి అలా చెయ్యి కడుక్కునేటప్పటికి పారేస్తాను"

"అప్పటిదాకా ప్రాణాలు కొరికేస్తా వన్నమాట"

"కొరికేస్తానా మళ్ళీ మడ్డాడితే నవిలేస్తానా?

"..............."

"మరి లేవండి"

"కాస్సేపు—"

"పనికిరాదు. ఊరికే కూచోనిస్తానా మిమ్మల్ని? మడి కట్టుకోమనే దాకా దొండపాదుకి నీళ్ళు తోడి పొయ్యండి"

"అదో ప్రాయశ్చిత్తం కూడానా?"

"అంతటితో కుదిర్చినందుకు సంతోషించండి"

"కోపం వస్తే వొళ్ళు రవలబెట్టుకుంటావు. పట్టుదల వస్తే ముందూ వెనకా చూడవు, తోచినంత చేసితీరతావు. ఈ కళంకం వొక్కటే లేక పోతేనా—"

"ఒహో, ఏమి గుణగ్రహణపారీణతా?"

"మరి నీయిష్టప్రకారమే నడుచుకుంటాను పద"

"అలా బుద్ధితెచ్చుకోండి"

10

"ఈపూటయినా అధరు వేదీ చెయ్యకపోతివిగదా, వో—ట్టి—వూర గాయతో కడు పెలా నిండుతుందో నువ్వే చెప్పు"

"నిండుతుం దని యెవ రన్నారో మీరే చెప్పండి"

"మాట్టాడితే యెదురువాదం"

"నోరు విప్పితే వంకరమాట"

"......................"

"అనవలసినవి నాలుగూ అంటే గాని మళ్ళీ మాతపడకపోడం"

"..............."

"దీపాలు పెట్టేదాకా మడికట్టుకోడం మీరో నేనో తేలకపోయె. అప్పు డయినా పొయ్యి మండక వొక్క అన్నం వార్చాటప్పటికే వూరు మాటు మణిగిపోయె"

"ఇలా యెసట్లో బియ్యం పోసేసి అలా కందిపప్పు రుబ్బితే యెవ రయినా వద్దంటారా?"

"వేయించిన పప్పు మొన్ననే అయిపోయింది కదా, బుద్ధివున్నవా ళ్లెవ రయినా మరి కందిపచ్చడి మాట యెత్తుతారా?"

"పెసరపప్పో?"

"చాయపప్పు తయారు కాందే?"

"పోనీ, మజ్జిగ పొగిస్తే?"

"రోజూ అదే? రుచి తెలిసినమాటే మీదీ?"

"మరి యివ్వ డేమి తినమంటావో చెప్పు, కోప్పడక"

"నిజంగానే చెప్పమంటున్నారా?"

"..............."

"వింటారు కదా?"

"............ ..."

"తీరా చెప్పాక, ఆ త్తేరీ, యిలా అంటావా అని గంతులు వేస్తే వొప్పు కోను సుమండీ!"

"..............."

"చెప్పెయ్యనా"

"..............."

"జామురా త్రయింది. వూరు మాటుమణిగిపోతోంది. ఇక మీరు వీధికి వెళ్ళనూ వెళ్ళరు, మన యింటికిన్నీ యెవరూ రానూ రారు, యింతట్లో మీ బ్రాహ్మణ్యమూ పోదు; కనక, కాస్త పులుసు — వుల్లిపాయ లొత్తిగించేస్తాను లెండి మీ కిష్టం లేకపోతే"

". . . . ."

"ఏమంటారు?"

"..............."

"మాట్లాడ రేమండీ?"

"అసలే వుల్లిపాయల పులుసా?"

". . . . ."

"ఆపైని, మధ్యాహ్నం చేసిందా?"

"అవును, వూరి యెంతో ఘుమఘుమ లాడిపోతోంది"

". . . . ."

"జిహ్వ నెందుకు చంపుకుంటారూ? నాలుగు తమలపాకులిస్తాను వేసుకోండీవేళకి గప్‌చిప్! తెల్లవారాటప్పటికి స్నానం చేసేసి మీ వీభూదిపించెకట్లూ, మీ తాటాకుల గొడుగూ మీరూ తయారు సాక్షాత్తూ వేదమూర్తి లాగ"

". . . . ."

"పుట్టుకురానా?"

". . . . ."

"మీవంకర చూపులు నాదగ్గిర చెల్లవు వెయ్యనా వద్దా?"

"ముందు పీక పిసికేసి తరవాత వడ్డించు"

"ఎంత సడసమూ?"

". . . . ."

"తింటే తినండి లేకపోతే మానుకోండి, తిని నన్నేం వుద్ధరిస్తారా? అంత కిట్టనప్పుడు మీ విస్తరిలో పారపోసి నే నెందుకు సగంసగం చేసుకోవాలీ? సాగనిచ్చినకొద్దీ ముదురుతున్నాయి వేషాలు. మనిషి కోఆధరువు నేను చెయ్యలేను. మజ్జిగ అయినా కావాలా వద్దా? ఆకలి దహించుకుపోతోంది నాకు, తొరగా తెమల్చాలి"

"పొద్దున్న ఫలప్రదానం బాపతు మూ డరిటిపళ్ళు తెచ్చాను, అవయినా పడెయ్యి విస్తరిలో"

"కూచున్నా యిప్పటిదాకా?"

"ఏమయిపోయాయి?"

"జీర్ణం అయి పోయాయి?"

"అయితే పెరుగుపట్టుకురా"

"తేవడాని కభ్యంతరం లేదు. సత్తప్పేలా పెరుగూ వొంచెయ్యడానికీ అభ్యంతరం లేదు, కాని అన్నం తింటూ తింటూ అబ్బాయి చెయ్యి విదిపాడు, ఒక్క మెతుకు పడింది పనికి వస్తుందా?

"పోనీ, పాలు పట్టుకురా"

"ఇంకా దాలిమీద పడెయ్యలేదు, పచ్చివి తేనా?"

"ఇప్పటిదాకా ఎందుక్కాచావు కాదూ?"

"కారణం చెబుతానే అనుకోండి. నుంచున్న పాళంగా మీకిప్పుడు వేడిపాలు వస్తాయా?"

"అయితే, నిమ్మకాయ కోసి—"

"కూచుంది నిమ్మకాయ"

''ఏమి చేశావూ?''

''ఏమి చెయ్యడాని కయినా చాలితేనా?''

''చాలకపోవడం దేల్లోకి?''

''ఉప్మాలోకి''

''ఎందుకు చేశావ్?''

''సుందరంగారి యింటో వున్నన్నాళ్ళూ కాఫీవుప్మాలు మెక్కి అత నొక్కమాటు వాకట్లోకి వస్తే పచ్చిమంచినీళ్ళిచ్చి పంపనా?''

''ఎంతసేపూ నువ్వూ నీవాళ్ళేగాని—''

''మావాళ్ళేం తీసిపోయారా మీ వాళ్ళ లాగ?''

''మే మన్నీ తింటాం, మా కన్నీ వస్తాయి. నేనమ్మా మహా చదివి గుట్టలుపెట్టానని అది పనికిరా దిది వల్లకాదన్న వాళ్ళకేం వస్తాయీ? పైగా అన్న మయినా సరిగా పెట్టడం లేదని నన్ను యాగీచెయ్యడమా? నేను చేసిన వన్నీ తినండి, మీకేం తక్కువవుతుందో చూస్తాను''

''మాలకూడు తినమంటావా?''

''తడిగుడ్డలతో తించే బ్రాహ్మణభోజనమూ తాపితాలు కట్టుకుని తిందే మాలకూడూనూ''

"........"

"బంగాళాదుంప లెక్కణ్ణుంచో రెయిల్లో వస్తాయి కనక పనికిరావు. కేబేజీ కిరస్తానీలది. గోంగూరపచ్చడిలో లెక్క రెండు వుల్లిరేకలు పడేస్తే

చెడిపోతుంది. ఉప్మా తింటే దేవతార్చన దెక్కడికిపోతుంది. కాఫీపుచ్చుకుంటే జంధ్యాలు మైలపడి పోతాయి"

"నీకు పుణ్యం వుంటుంది గానీ, యీపాటికి చాలించి కాస్త మజ్జిగ పట్టుకురా"

"కాస్తేం కర్మం, గిన్నెడూ వొంచేస్తాను జుర్రండి. మానాన్న ధర్మమా అని నిక్షేపంవంటి గేదె వుందిగదా?"

"పూటకి మానెడు పాలకి పైగా యిస్తుంది పాపం, కాని నాకు కమ్మని పెరుగు దొరకదు"

"పాలికాపాడు గుగ్గిళ్ళువేసి చిట్టుపెట్టడానికి వల్లకాకపోయే మనకి పెరుగేలా వస్తుంది?

"వాడిచేత ఆపని చేయించడం మానేశావా నువ్వు?"

"కనకనే మీకు పెరుగు వడ్డించడం మానేశాను"

"మరి యీమజ్జిగ—"

"ఆ పెరుగులో నీళ్ళు పోసి కడిగెయ్యలేదూ అంటు?"

11

"పోనీ, యిందాకా తమలపాకు లిస్తా నన్నావూ, లెక్క అయిదాకులూ వొక్క చెక్కా పట్టుకురా; చూతాం"

"ఆ రమ్మన్నారు పా—పం"

"అదేమిటి?"

"ఇదేమిటి?"

"మాటకి మాట—"

"అందించకపోతే యీకొంపలో బతగ్గలుగుదునా నేను?"

"........."

"అక్కడికి, తమరు మహా గొప్పవాళ్ళయినట్టూ, యివతలివాళ్ళు దాసీ పీనుగు లయినట్టూను. మంచిచెడ్డలూ కష్టసుఖాలూ అక్కర్లేదు గాని తాంబూలాలు మాత్రం కావాలి, తాంబూలాలు. నే నిస్తా నన్నానుట చేతులు కట్టుకుసీ. పులుసు వేసుకున్నవాళ్ళకే తాంబూలాలు"

"పులుసుకీ తాంబూలానికీ సంబంధం యేమిటి?"

"తాంబూలానికీ దేవతార్చనకీ పొత్తేమిటి?"

"అంటే?"

"ఏకాదశిపూటా మీకు తాంబూలా లేమిటండి మాలకూడు కాకపోతేనూ?"

"హోస్ అదా? మధ్యాహ్నం మూడుగంటలకే వెళ్ళిపోయింది ఏకాదశి"

"పంచాంగం చూసుకుని మరీ వచ్చారు కామోసు సిద్ధంగా, ద్వాదశి గడియలు వచ్చేశాయి, నే నివ్వను బాబూ"

"తెస్తూ కబుర్లు చెప్పక"

"ఊరుకుందురూ వేషాలు వెయ్యక"

"హాస్యాల కయినా హద్దుండాలి"

"ఆడబోయి ఆడబోయి మీతోటే ఆడాలి హాస్యాలు. అయ్యో, రామ!"

"చూడూ"

"నేను చూడను. పునమి వెళ్ళాకే యిక మీకు తాంబూలం"

"ఛా"

"ఛా లేదు, ఛీ లేదు. నా మనస్సు మనస్సులో లే దివాళ, నన్నిక మట్టాడించకండి"

"పోనీ మూడాకులు—"

"మూడు కాదు వొక్కటి కాదు, చివరికి, తమలపాకు తొడిమ అయినా మీకివ్వను. ఆకు లెన్నో లేవు, మీకిస్తే సుందరంగారి వూరు వెళ్ళేదాకా నాకు చాలవు"

"నాకు లేకుండా రోజూ నీకు తాంబూలా లేం?"

"పునిస్త్రీ పడుచుకి తాంబూలం యేమి టని మీరు కనక అనగలిగా రూరుకోండి యీపాటికి"

"నువ్వు పుణ్యస్త్రీపడుచు వైనట్టే నేను ధర్మపత్ని సమేతుణ్ణి! తెలుసా?"

"అయ్యో, కా కేం? ఇప్పటి కయినా మీకు ధర్మపత్ని అంటే యేమిటో తెలిసింది, మంచిదే కాదూ?"

"మరి మంచి కనపడదేం?"

"సంతోషిందాం తెలివికి"

"సంతోషానికి చిహ్నం తాంబూలం"

"వేసుకుంటూనే వున్నానుగా...."

"అఘోరించిన ట్టుంది, తాంబూలం అంటూ వుంటే అలా పడుకుంటావేం"

"..............."

"మాట్లాడవేం?"

"..............."

"వోసి నీలతుకో—"

"మంచం నడుమెక్కి కూచుని తెల్లవార్లూ తిట్టుకోండి"

"..............."

"..............."

"అయితే, అబ్బాయిని వుయ్యాలలో పడుకోబెట్టావు కాదేం?"

"నిద్ర ముంచుకు వచ్చేస్తోంది నన్ను పలకరించవద్దిక"

"ఇవాళ యింత పెందరాడే నిద్రేం"

"ప—గ—లు—ని—ద్ర—పో—లే—వ్"

"..............."

1928 మే నెల భారతినుంచి

పెంపకం